క్లుప్తంగా

మెప్మా రికార్డుల తనిఖీ



పెడన: మెప్మాలో ఇటీవల పొదుపు సంఘాలు, వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన రికార్డులను సోమవారం మెప్మా ఐబీ అధికారి టి.మమత పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో పొదుపు సంఘం తీసుకున్న రుణం, వడ్డీ, అసలు కలిపి తీసుకున్న రోజు నుంచి పొదుపు మహిళలు నమోదు చేయడంపై అభ్యంతరం తెలియజేశారు. చాలా మంది పొదుపు మహిళలు అదే విషయాన్ని ఆన్‌లైన్‌లోనే కాకుండా రికార్డుల్లో కూడా నమోదు చేయడంతో చాలా పొదుపు సంఘాల వివరాలు వెనక్కు పంపించారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో వాటిని సరిచేసేలా చూడాలని పేర్కొవడంతో ఐబీ అధికారి మమత సోమవారం పెడన మెప్మా అధికారులను, పొదుపు ఆర్పీలను కలిసి దిశా నిర్దేశం చేశారు. టీఎంసీ భోగేశ్వరరావు, సీవోలు వెంకటేశ్వరరావు, నాగమ్మ ఉన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



పెడన: అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఐసీడీఎస్ సీడీపీవో సముద్రవేణి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశం హాలులో నందమూరు, చెన్నూరు సెక్టార్లకు సంబంధించిన అంగన్‌వాడీ కార్యకర్తలతో నెలవారీ సమావేశం నిర్వహించారు. సీడీపీవో సముద్రవేణి మాట్లాడుతూ ఆయా కేంద్రాల్లోని బాలింతలు, గర్భిణులు, చిన్నారులు వివరాలను కచ్చితంగా నమోదు చేసి ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీరికి అందించే పౌష్టికాహార వివరాలు, చిన్నారుల బరువులు ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. రిజిస్టర్లలో కేంద్రాలను సందర్శించినవారి సంతకాలు తీసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్లు శ్రావణికుమారి, కల్పవల్లి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



మత్రిపాలెం(నాగాయలంక): టి.కొత్తపాలెం శివారు డేగలవారిపాలెంలోని నెహెమ్యా మినిస్ట్రీస్ చర్చి ఆధ్వర్యంలో జనవరి పండగ పురస్కరించుకుని సోమవారం మత్రిపాలెం ఎస్టీ కాలనీలో గిరిజన (యానాదులు)బాలలు 30 మందికి నూతన దుస్తులు, 15 మందికి దుప్పట్లు బహూకరించారు. వీటిని మినిస్ట్రీస్ డైరెక్టర్ సాలి పాల్ నెహెమ్యా చేతులమీదుగా అందజేశారు. తొలుత కేక్ కట్‌చేసి పిల్లలకు పంచారు. చిల్డ్రన్స్‌హోమ్ ఆర్గనైజర్ సుకన్య పాల్, చర్చి సంఘపెద్దలు, విశ్వాసులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామంగా విభజించాలని వినతి



ఘంటసాల: పంచాయతీకి ఆదాయం లేక అభివృద్ధిలో వెనుకబడుతున్నామని అధికారులు తక్షణమే స్పందించి మా పంచాయతీని రెవెన్యూ గ్రామంగా విభజించాలని కోరుతూ ఘంటసాలపాలెం సర్పంచ్ దోనె రజని మచిలీపట్నంలో మీ కోసం కార్యక్రమంలో సోమవారం అర్జీ సమర్పించారు.

ఘంటసాలపాలెం గ్రామ పంచాయతీ 1480 మంది జనాభ ఉండగా అందులో ఎస్సీలు మూడు వంతులు ఉన్నారని అనగా రెండు మాల పల్లెలు, ఒక గూడెం (మూడు ఎస్సీ కాలనీలు) ఉన్నాయన్నారు. పంచాయతీ ఆదాయం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ తెలిపారు.

రేషన్ సరఫరా సక్రమంగా నిర్వహించండి

మోపిదేవి: మండల తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పీడీఎస్‌డీటీ ఖాసిం మాట్లాడుతూ రేషన్ సరఫరాలో లబ్ధిదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా ఎండీయూ ఆపరేటర్లతో సమన్వయం చేసుకుని రేషన్ అందించాలని సూచించారు. తహసీల్దార్ శ్రీవిద్య అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. డీలర్లు మాట్లాడుతూ తాము నాగాయలంక గోదాము వద్ద సరుకులు తీసుకుంటున్నామని, కానీ గోదాము వద్ద వేలిముద్ర తీసుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ వేలి ముద్రలు పడని డీలర్లను పామర్రు గోదాము వద్దకు వెళ్లమంటున్నారని, అక్కడ కూడా పనిచేయకపోవడంతో పదేపదే అక్కడకి ఇక్కడకి తిప్పుతున్నారని తెలిపారు. ఇన్‌చార్జి ఆర్‌ఐ మోపిదేవి శ్రీనివాసరావు, వీఆర్‌ఓలు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

సెలవుల్లో సిబ్బంది.. రోగులకు ఇబ్బంది

- సెలవుల్లో వైద్యాధికారులు..సిబ్బంది
- పెడన పీహెచ్‌సీలో వింత పరిస్థితి
- ఎంఎల్‌హెచ్‌పీలు..ట్రైనీల వైద్య సేవలు
- పాము కాటుతో వచ్చిన పేషెంట్‌కు రక్త పరీక్షలందని వైనం



పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పెడన: పేదలకు వైద్య సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో. ఇందుకు పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలే నిదర్శనం.

అందుబాటులో లేని వైద్యులు..

సోమవారం ఉదయం కొప్పెల్లి నుంచి పాము కాటుకు గురై రక్త పరీక్షలు చేయించుకోవడానికి పెడన పీహెచ్‌సీకి వస్తే వింత పరిస్థితి ఎదురైంది. ఇక్కడ ఇద్దరు వైద్యులు ఉండాలి. కానీ వీరిలో ఒకరు పర్వేజ్ హైదర్ సెలవు పెట్టడంతో మరొక వైద్యురాలు మీనాదేవి ఫ్యామిలి ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని కాకర్లమూడిపాలెం గ్రామంలో విధుకు వెళ్లారు. ఇలా రోజుకు ఒక ఊరు వెళుతుంటారు. డాక్టర్ ఫయాజ్ ఎన్ని రోజులు సెలవు అంటే సిబ్బంది ఎవరూ చెప్పలేకపోతున్నారు.

దీనంగా రోగులు..

ఇక్కడకు వచ్చే రోగుల పరిస్థితి దీనంగా ఉంది. పెడన పీహెచ్‌సీ నిర్వహణ బాధ్యతలను మడక ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతికి అప్పగించారు. సదరు ఎంఎల్‌హెచ్‌పీ సైతం ఆసుపత్రిలో చాలా సేపు కనిపించలేదు. ఎఫ్ఎన్‌వో, ఫార్మసిస్టు, అటెండర్లు వైద్య సేవలందిస్తూ కనిపించారు. వీరికి తోడు మచిలీపట్నం లేడియాంప్టిల్ కళాశాలలో ఒకేషనల్ కోర్సు నర్సుకు సంబంధించి మొదటి సంవత్సరం విద్యార్థినులు నెల రోజులు పాటు శిక్షణ కోసం వచ్చిన వారున్నారు. వీరు వచ్చిన వారికి వైద్య సేవలను అందిస్తూ వారి రికార్డులను రాసుకుంటూ కనిపించారు.

పాము కాటుకు గురై వస్తే..

మండలంలోని కొప్పెల్లి గ్రామానికి చెందిన నాగమల్లేశ్వరరావు సోమవారం ఉదయం పొలంలో పనులు చేసుకుంటున్న సమయంలో పాము కాటుకు గురయ్యాడు. అతను వెంటనే చేవేంద్ర పీహెచ్‌సీకి వెళ్లడంతో అక్కడ వైద్యాధికారి ప్రదీప్ కుమార్ పరీక్షించి ముందస్తు జాగ్రత్తగా ఇంజక్షన్ చేయించి రక్తపరీక్షలు రాశారు. అక్కడే రక్త పరీక్షలు చేయాల్సి ఉండగా ల్యాబ్ టెక్నీషియన్ సెలవు పెట్టడంతో పెడన పీహెచ్‌సీకి సిఫార్సు చేశారు. సదరు పేషెంట్ ఇంజక్షన్ చేయించుకుని పెడన పీహెచ్‌సీకి రావడంతో పెడన పీహెచ్‌సీలో కూడా ల్యాబ్ టెక్నీషయన్ సెలవులో ఉండటంతో ఏమి చేయాలో పాలుపోలేదు.


పాము కాటుకు గురైన నాగమల్లేశ్వరరావుకు రక్త పరీక్ష చేస్తున్న ట్రైనీ విద్యార్థినులు

ఇక్కడ కొన్ని పరీక్షలే చేస్తాం.. మచిలీపట్నం వెళ్లండి..

శిక్షణలో ఉన్న విద్యార్థినులు, ఫార్మసిస్టు రక్త పరీక్షలకు ఉపక్రమించారు. కొన్ని పరీక్షలు చేస్తామని, మరికొన్ని యూపీహెచ్‌సీకి వెళ్లాలని సూచించారు. అయితే యూపీహెచ్‌సీలో కూడా ఈ పరీక్షలు చేయడం లేదని తెలిసి మచిలీపట్నం పెద్దాసుపత్రికి వెళ్లాల్సిందేనని పేషెంట్‌కు పెడన వైద్య సిబ్బంది చెప్పడంతో అక్కడికి తీసుకెళ్లారు. అయితే పెడన ల్యాబ్ టెక్నీషియన్ రజనీ క్రిస్మస్ పర్వదినం రోజున విధులు నిర్వహించి సోమవారం సెలవు పెట్టారని వైద్య సిబ్బంది పేర్కొన్నారు.

పరీక్షలపై అయోమయం..

ట్రైనీ విద్యార్థినులు రక్త పరీక్షలు సక్రమంగా చేస్తారా.. రిపోర్టులు సరిగ్గానే వస్తాయా అంటూ సదరు పేషంటు సందేహం వెలిబుచ్చడం గమనార్హం. రిపోర్టు వచ్చినా ఆ రిపోర్టు ఆధారంగా పరిస్థితిని ఎవరు తెలియజేస్తారంటూ పేషెంట్ ఆవేదన వ్యక్తం చేశారు.

వైఎస్సార్ సీపీ హయాంలో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీలకు ఆధునిక పరికరాలను అందజేసింది. సిబ్బందిని అందుబాటులో ఉంచింది. సుమారు 50కి పైగా రక్త పరీక్షలు చేయించడానికి అవకాశం ఉంది. పెడన, చేవేంద్ర పీహెచ్‌సీలతో పాటు పెడన యూపీహెచ్‌సీలలో కూడా సీబీఎస్ రక్త పరీక్ష చేయడానికి పరికరాలున్నా సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు.

అందరూ సెలవులో ఉంటే..

ఒకరు లేకపోయినా కనీసం మరొకరైనా వైద్య సేవలందించాలి. అందుకు తగిన విధంగా ప్రణాళిక వేసుకోవాలి. ఈ మేరు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. కానీ అలా జరగడంలేదు. ఇది ప్రజకు ఇబ్బందిగా మారింది.



పెడన పీహెచ్‌సీలో ఖాళీగా మొదటి వైద్యాధికారి సీటు

సీరియస్ కేసు అయితే చెప్తున్నారు..



సీరియస్ కేసు వస్తే నాకు ఫోన్ చేసి తెలియజేస్తున్నారు. సోమవారం ఒక్క రోజు నేను సెలవు పెట్టా. కొంత మంది సిబ్బంది కూడా సెలవు పెట్టారు. స్నేక్ బైట్ కేసుకు సంబంధించి రక్త పరీక్షలు చేసే టెక్నీషియన్ కూడా సెలవు పెట్టారు. ఎలా చేయాలో ట్రైనీలకు ఫోన్‌లో చెబితే పరీక్షలు చేశారు. ఇంజక్షన్ చేసి మందులు ఇచ్చి పంపించారు. సీరియస్ అయితే మేమే 108 వాహనంలో మచిలీపట్నం పెద్దాసుపత్రికి పంపిస్తాం. సోమవారం వచ్చిన స్నేక్‌బైట్ కేసుకు అటువంటి పరిస్థితి లేదు.

– డాక్టర్ పర్వేజ్‌హైదర్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, పెడన

సీతారామయ్య మరణం తీరనిలోటు



తాడేపల్లి(ఘంటసాల): వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, మాజీ సర్పంచి సీతారామయ్య మరణం పార్టీకి తీరనిలోటని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. ఘంటసాల మండలం తాడేపల్లి గ్రామానికి మాజీ సర్పంచ్ తాతా సీతారామయ్య ఇటీవల మరణించగా సోమవారం సంస్మరణ సభ నిర్వహించారు. సీతారామయ్య చిత్రపటానికి సింహాద్రి పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించి ఆయన సేవలను కొనియడారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తాడేపల్లి, యండకుదురు సర్పంచులు పడమట సీతామహాలక్ష్మి, ముళ్లపూడి పట్టాభి రామారావు, కొత్తపల్లి పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ తాతినేని కృష్ణారావు, పార్టీ సేవాదళ్ మండల అధ్యక్షుడు దిరిశం పిచ్చేశ్వరరావు, పార్టీ నేత పడమట వీరకుమార్, ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మీకోసం.. అధికారులు డుమ్మా!

పెడన: మండల స్థాయిలోనే అధికారులంతా కలిసి తహసీల్దారు కార్యాలయంలో అర్జీలను స్వీకరించాలని జిల్లా కలెక్టర్ బాలాజీ ఇచ్చిన ఆదేశాలను మండల స్థాయిలో కొందరు అధికారులు బేఖాతర్ చేస్తున్నారు. రెగ్యులర్‌గా ఉండే తహసీల్దారు, ఎంపీడీవో, మున్సిపల్, విద్యుత్, గృహ నిర్మాణ శాఖలకు మినహా మిగిలిన ఆయా శాఖల అధికారులు హాజరు కావడం లేదు. వాస్తవంగా ఆయా శాఖాధికారులు, సిబ్బంది అయినా హాజరు కావాలని ఆదేశాలున్నాయి. ఎవరూ హాజరుకాకపోయినా అందుకు కారణాలను తహసీల్దారుకు తెలియజేయాలి. కానీ ఆ పరిస్థితి పెడన మండలంలో కనిపించడం లేదు. సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమానికి వ్యవసాయం, గ్రామీణ తాగునీటి నీటి సరఫరా, ఇరిగేషన్, డ్రెయినేజీ, పోలీస్, ఎక్సైజ్, పంచాయతీ రాజ్, ఐసీడీఎస్ తదితర శాఖల వారు డుమ్మా కొట్టారు. ఐసీడీఎస్ వారు సమావేశం ఉందని వచ్చి వెళ్లిపోయారని, మిగిలిన వారు ఎందుకు రావడం లేదనే దానిపై సంజాయిషీ కోరతామని ఇన్‌చార్జి తహసీల్దారు అనిల్‌కుమార్ తెలిపారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వ పింఛన్‌కు కృషి

ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలో ఏపీఎస్‌ఆర్టీసీలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన పింఛనుదారులకు ఇతర ప్రభుత్వ ఉద్యోగుల్లా ప్రభుత్వం నుంచే పింఛను ఇప్పించేందుకు కృషి చేస్తానని ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. నగరంలోని బెల్ ఆడిటోరియంలో సోమవారం రాత్రి ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథి నారాయణరావు మాట్లాడారు. ఈ సందర్భంగా నారాయణరావు, ఆర్టీసీ డీఎం టి.పెద్దిరాజులను సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. సీనియర్ కార్మికులను నారాయణరావు సత్కరించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కేఆర్ ఆంజనేయులు, కోశాధికారి సుబ్బారావు, పీఆర్వో సీతారామయ్య, డిపో అధ్యక్షుడు ఎంఎం.రావు, డిపో ప్రధాన కార్యదర్శి సుంకర రాఘవరావు, రిటైర్డ్ కార్మికులు హాజరయ్యారు.

వృత్తి విద్య కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో వివిధ రకాల వృత్తుల ద్వారా సేవలందిస్తున్న వృత్తిదారులకు మెప్మా ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్యాభివృద్ధికి త్వరలో శిక్షణ ఇవ్వనున్నట్టు కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లంబర్లు, పెయింటర్స్, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, ఏసీ, వాషింగ్‌మిషన్, టీవీ మెకానిక్స్, గీజర్ మెకానిక్స్, బ్యుటీషియన్లకు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఈనెల 31వ తేదీ సాయంత్రం లోగా నగరపాలక సంస్థ కార్యాలయంలోని మెప్మా విభాగంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

కులగణన సర్వే ప్రదర్శించాలి

అవనిగడ్డ: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణన సర్వే లెక్కలు గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సర్వే లెక్కలు ప్రజలకు తెలియజేయాలని, వాటిపై అభ్యంతరాలు ఉంటే స్వీకరించాలని జిల్లా అధికారులు చెబుతున్నప్పటికీ సచివాలయాల్లో ఇలాంటివి ఏమీ జరగడం లేదన్నారు. సచివాలయాల్లో ఈ వివరాలు మొక్కుబడిగా ప్రదర్శిస్తున్నారని, కొన్నిచోట్ల ప్రదర్శించిన వాటిలో వివరాలు తప్పుల తడకగా ఉన్నాయని గోవర్ధన్ చెప్పారు. గ్రామాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అభ్యర్థనలు స్వీకరించేందుకు గడువు పొడిగించాలని గోవర్ధన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అమిత్ షా మంత్రి పదవికి రాజీనామా చేయాలి

వామపక్ష నాయకుల డిమాండ్


నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు


మోపిదేవి సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మచిలీపట్నంటౌన్: డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంటు సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని సీపీఎం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీల పిలుపు మేరకు మచిలీపట్నంలో వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక రేవతి థియేటర్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ భారతదేశానికి రా జ్యాంగం ద్వారా దశా, దిశా తెలిపిన మహోన్నతమైన వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని అన్నారు. సీపీఎం సీనియర్ నాయకులు కొడాలి శర్మ మాట్లాడుతూ వివిధ సంస్కృతులు, ఆచారాలు, కట్టుబాట్లు, పలు మతాలు కలిగిన ఈ దేశంలో లౌకిక రాజ్యాంగాన్ని ధ్వంసం చేయాలని బీజేపీ ప్రయత్నం చేస్తుందని, అటువంటి విధానంలో భాగమే ప్రస్తుతం పార్లమెంట్లో అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని అభిప్రాయపడ్డారు. సీపీఐ మచిలీపట్నం నియోజకవర్గ కార్యదర్శి లింగం పిలిఫ్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కనపెట్టేవిధంగా వ్యవహరిస్తోందన్నారు. సీపీఐ జిల్లా మహిళా సంఘం నాయకురాలు దేవభక్తుని నిర్మల మాట్లాడుతూ కులాలు, మతాలకు అతీతంగా ఈ రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, ఈ రాజ్యాంగం ఉన్నంతకాలం అంబేడ్కర్ సజీవంగా ఉంటారని కొనియాడారు. సీపీఎం నాయకులు టీ చంద్రపాల్, మచిలీపట్నం ఐద్వా నగర కార్యదర్శి కొడాలి సుజాత, సీపీఐ నాయకులు వై. ఈశ్వరరావు, సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు ఎండీ యూనస్, నాయకులు ఎస్.ధనుంజయరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ గోపాలరావు, పార్టీ కమిటీ సభ్యులు టీ చాందిని దుర్గ, ఐద్వా కమిటీ సభ్యులు బూర భవాని, మహిళా సంఘం నాయకురాలు ఒడుగు రత్నకుమారి, ఈడే రామారావు, ఎర్రంశెట్టి దుర్గాప్రసాద్, బండి అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి: స్థానిక ప్రధాన సెంటర్‌లో సీపీఎం మండల కార్యదర్శి బండి ఆదిశేషు ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ మండల కమిటీ సభ్యులు సిరివెల్ల రాజశేఖర్, మరీదు సురేష్‌బాబు, కొమ్ము జయరావు, కర్ర వెంకటేశ్వరావు, ఆటో యూనియన్ నాయకులు సుబ్బారావు, మద్దాల వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాలపాలెం(ఘంటసాల): మండలంలోని ఘంటసాలపాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. తక్షణమే అమిత్‌షా మంత్రి పదవికి రాజీనామ చేయాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి మేడంకి వెంకటేశ్వరరావు, సీనియర్ నేత వాకా రామచంద్రరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మొహమ్మద్ కరీముల్లా, మండల కమిటీ సభ్యులు బలే రమేష్, గొరుముచ్చు భాస్కరరావు, గొరుముచ్చు వీరాంజనేయులు, గొరుముచ్చు ధనలక్ష్మి, చిర్ల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన


విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎంఈవో హరినాథ్

పెడన: మండల పరిధిలోని బల్లిపర్రు గ్రామంలో సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో సోమవారం మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఎంఈవో-2 వై. హరినాథ్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రూతమ్మ ప్రదర్శనను ప్రారంభించారు. మండలంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు 19 ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. వీటిల్లో జిల్లా స్థాయికి కొన్నిటిని ఎంపిక చేసి పంపుతున్నట్లు ఎంఈవో హరినాథ్ తెలిపారు. మండల స్థాయిలో క్విజ్ పోటీల్లో గెలుపొందిన వాటిని జిల్లా స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. జిల్లా స్థాయిలో జరిగే పోటీలను త్వరలో తెలియజేస్తామన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

మోపిదేవి: స్థానిక ఆశ్రమ పాఠశాలలో మండల స్థాయి ఎగ్జిబిషన్‌ను సోమవారం నిర్వహించారు. మండలంలోని 8, 9, 10వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారని తెలిపారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించారు. మండల స్థాయి క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలు జె.అదీప్ (పదో తరగతి), వై.అక్షయ కుమార్ (9వ తరగతి), ఎం.ఏడుకొండల స్వామి (8వ తరగతి), ద్వితీయ స్థానంలో డి.బుల్లా (10వ తరగతి), కె.చేతన సౌమ్య (10వ తరగతి), పి.శివనాగ జ్యోతి (10వ తరగతి) విజేతలుగా నిలిచారన్నారు. విద్యార్థులు జనవరి 2న గుడివాడ మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నాలన్నారు. మండలంలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘంటసాల: మండలస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్, క్విజ్ పోటీలు మండలంలో సోమవారం మొక్కుబడిగా నిర్వహించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్, క్విజ్ పోటీలు నిర్వహించాల్సి ఉంది. సైన్స్ ఎగ్జి బిషన్, క్విజ్ పోటీలను తూతూ మంత్రంగా ముగించారు. కనీసం మీడియాకు కూడా సమాచారం ఇవ్వకపోవడం విశేషం.

శ్రీకాకుళం హైస్కూల్ ప్లస్ విద్యార్థుల ప్రతిభ

ఘంటసాల జడ్పీ హైస్కూల్ ప్లస్‌లో జరిగిన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో శ్రీకాకుళం హైస్కూల్ ప్లస్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని టి.హన్సిక ఫణిదేవి వ్యక్తిగత విభాగంలో ఫింగర్ ప్రింట్ బేస్డ్ కార్ డిటెక్టర్ ఎగ్జిబిట్‌కు ప్రథమస్థానం సాధించగా, 8వ తరగతి చదువుతున్న గాడ్‌లియోదేవ్ మల్టీపర్పస్ ఫ్యాన్ ఎగ్జిబిట్‌కు కన్సోలేషన్ బహుమతి సాధించడంతో పాటు మండల స్థాయి క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించినట్లు హైస్కూల్ ప్లస్ హెచ్ఎం అమ్మిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి తెలిపారు.

మచిలీపట్నంటౌన్: నగరంలోని జైహింద్ సెకండరీ పాఠశాలలో సోమవారం మండల స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో మండలంలోని 47 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పలు ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. వ్యక్తిగత విభాగంలో రుద్రవరం గురుకుల పాఠశాల విద్యార్థి పి.సుకుమార్ ప్రదర్శించిన స్మార్ట్ ఇరిగేషన్ సిస్టమ్, గ్రూప్ విభాగంలో రుస్తుంబాద మునిసిపల్ హైస్కూల్‌కు చెందిన జి.జగదీష్, పి.పవన్ వెంకటకుమార్ ప్రదర్శించిన ఆటోమెటిక్ గేట్ ఆపరేటింగ్ సిస్టమ్ ఆకట్టుకుంది. ఉపాధ్యాయుల విభాగంలో అదే పాఠశాలకు చెందిన ఎస్.స్వాతి, విద్యార్థినులు కె.లిఖిత, ఎస్.కావ్య, ఎం.గ్లోరియా క్విజ్ విభాగంలో ప్రథమ స్థానం పొందారు. ఎంఈవో ఎంవీఎస్‌డీ దుర్గాప్రసాద్, ఎంఈవో-2 కె.గురుప్రసాద్, మండల సైన్స్ ఆఫీసర్ వి.శ్రీనివాసరావు, జైహింద్ పాఠశాల హెచ్ఎం ఎస్. సూర్యనారాయణ, చిలకలపూడి ఉన్నత పాఠశాల హెచ్ఎం వి. కృష్ణమూర్తి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించిన విద్యార్థులను అభినందించారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం


అధ్యక్షుడు శ్రీనివాస్‌కు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న నాగసాయి తదితరులు

పెడన: మండల ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. సోమవారం స్థానిక శ్రీవాసవి ప్రార్థన మందిరంలో ఆర్యవైశ్య సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సన్నిధి నాగసాయి, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) తదితరులు పాల్గొన్నారు. పెడన మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా దేసు శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడిగా కొత్త ఫణిభూషణరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా జల్లూరి చిట్టి కోటయ్య, ఉపాధ్యక్షుడిగా మామిడి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎండూరి లక్ష్మీకాంతరావు, కార్యదర్శిగా పద్మనాభుని వెంకటేశ్వరరావు, కోశాధికారిగా కొల్లిపర నాగేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఆర్యవైశ్య సంఘం జిల్లాతో పాటు మచిలీపట్నం, గుడ్లవల్లేరు, పెడన నాయకులు చెక్క ఆంజనేయులు, వేముల శ్రీనివాస్, మామిడి వెంకట వరప్రసాదరావు, పద్మనాభుని నరసింహా మూర్తి (శేఖర్), మురళి, పొట్టా హరిగోపాల్ తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

కోడూరు: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ (రాజా) ఆర్థిక సహాయం అందించారు. మండలంలోని నక్కవానిదారి గ్రామానికి చెందిన అప్పికట్ల సుబ్బారావు పూరిల్లు ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. సోమవారం బాధిత కుటుంబాన్ని వెంకట్రామ్ పరామర్శించి, రూ.5 వేల నగదును అందించారు. దుస్తులు, నిత్యావసర సరుకులు, కూరగాయలు, బియ్యాన్ని కూడా అందించారు. కూటమి నేతలు పాల్గొన్నారు.

శివయ్యకు అమావాస్య అభిషేకాలు

నాగాయలంక: స్థానిక శ్రీరామ పాదక్షేత్రం పుష్కరఘాట్‌లో కృష్ణానదిలోని శ్రీగంగ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి మండపంలో శివయ్యకు సోమవారం విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజ జరిపారు. క్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో అంబా సాయికిరణ్ శర్మ నేతృత్వంలో స్థానిక అయ్యప్ప స్వాములు, మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో కలిసి విభూది, నారికేళ, గోక్షీరం, తేనె, పంచదార, పసుపు, కుంకుమ తదితర ద్రవ్యాలతో అభిషేకించారు. సోమవారంతో అనుసంధానంగా అమావాస్య వస్తే దానినే సోమావతి అమావాస్య, పంచాంగాల్లో అమాసోమవార వ్రతంగా పేర్కొంటారని సాయికిరణ్ శర్మ వివరించారు. పూజలు జరిపి మంత్రపుష్ప నీరాజనాలు సమర్పించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చినకళ్లేపల్లి(ఘంటసాల): మండలంలోని చినకళ్లేపల్లి ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ గుత్తికొండ రామారావు సోమవారం ప్రారంభించారు. రూ.3 లక్షల ఉపాధి నిధులతో 56 మీటర్ల పొడవున సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు చెప్పారు. పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ నయూమ్, ఈఏ వి.నగేష్, సుధీర్ ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

అవనిగడ్డ: నియోజకవర్గంలోని పదిమంది లబ్ధిదారులకు రూ.8,59,002 సీఎం సహాయనిధి చెక్కులను సోమవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఈ చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందించారు. పలువురు జనసేన, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై శిక్షణ

గూడూరు: కిశోర వికాసంపై మండల స్థాయి ఒకరోజు శిక్షణ తరగతులు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీడీవో బి.రాజేశ్వరి మాట్లాడుతూ గ్రామస్థాయిలో కార్యక్రమం విజయవంతంగా అమలు కావడానికి గ్రామస్థాయి కమిటీలు కృషి చేయాలని కోరారు. సభ్యులు నెలలో రెండుసార్లు తమ సచివాలయ పరిధిలో ఉన్న తల్లిదండ్రులను సమావేశపరిచి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. సీడీపీవోట కే గ్లోరి, ఎంఈఓ పి.సుబ్రహ్మణ్యం, పీహెచ్ఎన్ డి.ఝాన్సిరాణి, ఏపీఎం వై.గోవిందరాజు, ఎన్జీవో ప్రశాంతి పాల్గొన్నారు.